సాక్షి ప్రకాశం

బుధవారం ၊ 7 ၊ ఆగస్టు ၊ 2024



నిత్యావసరాలకు కూటమి కత్తెర

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే నిత్యావసరాలకు కత్తెర వేసింది. రెండు నెలలుగా బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. - 8లో..



సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సాఫ్ట్‌బాల్ జిల్లా సీనియర్ విభాగం స్త్రీ, పురుషుల జట్లను మంగళవారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి దేవి

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ బాలికల ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరంలో మూడో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ (బాలికల) ప్రిన్సిపాల్ పీ ఉమామహేశ్వరి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 26లోపు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్ డౌన్‌లోడ్ చేసి ఈనెల 27న ప్రభుత్వ బాలుర ఐటీఐలో సర్టిఫికెట్స్ ధ్రువీకరణకు హాజరు కావాలని కోరారు. ఈనెల 29 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. కౌన్సెలింగ్‌లో సెలక్ట్ అయిన వారు అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు. అడ్మిషన్ సమయంలో అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను తప్పనిసరిగా సమర్పించాలని చెప్పారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలికలు) ఒంగోలు ఆఫీస్ సమయాల్లో లేదా సెల్ నంబర్ 9603041678, 8977711292లను సంప్రదించాలని కోరారు.

దళితులు రాజ్యాధికారం వైపు పయనించాలి

- దళిత హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్

ఒంగోలు: దళితులు రాజ్యాధికారం వైపు పయనించే దిశగా అడుగులు వేయాలని దళిత హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ పేర్కొన్నారు. చుండూరు మృతవీరుల 33వ సంస్మరణ సభను మంగళవారం స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991 ఆగస్టు 6వ తేదీన జరిగిన మారణ హోమానికి ఇంతవరకు శిక్షలు లేవన్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితులు తలెత్తకుండా ఉండాలంటే రాజ్యాధికారం వైపు పయనించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, ఎస్‌కె జిలాని, కె.ఏసు దాసు, ఎం.రమేష్, సీహెచ్ వివేక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే సంపూర్ణ వ్యక్తిత్వానికి నిదర్శనం



మానసిక ఆరోగ్య దినోత్సవంలో మాట్లాడుతున్న సైక్రియాటిస్ట్ చంద్రశేఖర్

ఒంగోలు టౌన్: మానసికంగా ఆరోగ్యంగా ఉండడమే సంపూర్ణ వ్యక్తిత్వానికి నిదర్శనమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నర్సింగ్ కాలేజీలో జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. జ్వరం, జలుబు, దగ్గులాగా ఎలాంటి జబ్బు చేసినా వెంటనే వైద్యుడి వద్దకు చికిత్స చేయించుకున్నట్లే మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఎలాంటి సమస్య కనిపించినా వెంటనే సైక్రియాటిస్టును కలిసి సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలు వీడిచి పెట్టాలని చెప్పారు. మానసిక అనారోగ్యం వలన కలిగే ఇబ్బందులు, సమస్యలను చర్చించారు. మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సైక్రియాటిస్ట్ చంద్రశేఖర్, క్లినికల్ సైకాలజిస్ట్ ఏడుకొండలు, ప్రోగ్రాం సోషల్ వర్కర్ అనిల్ కుమార్, రిమ్స్ నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ సుమిత్ర పాల్గొన్నారు.


18న నాగభైరవ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

ఒంగోలు మెట్రో: నాగభైరవ సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు స్థానిక మల్లయ్యలింగం భవనంలో నిర్వహించనున్నారు. సభలో సాహిత్య పురస్కారాలు ఏనుగు నరసింహారెడ్డి, పూటికూరి వరప్రసాద్లకు, కళాపురస్కారం వై.ఎస్.కృష్ణేశ్వరరావుకు, ఆత్మీయ పురస్కారం డా.బీరం సుందరరావుకు అందజేస్తారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సభలో నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), తేళ్ళ అరుణ, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్, గుళ్లాపల్లి సుబ్బారావు, డా.కందిమళ్ల సాంబశివరావు, డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు, సింహాద్రి జ్యోతిర్మయి, చుండి వెంకన్నరావు తదితరులు హాజరుకానున్నారు. నాగభైరవ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తారని నిర్వాహకులు నాగభైరవ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పుకో తమ్ముడూ..!

యర్రగొండపాలెం ఎస్సీ రిజర్వు నియోజగవర్గం అధికార తెలుగుదేశం పార్టీలో వర్గపోరు ముదురుతోంది. నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి సై అంటే సై అంటూ కయ్యానికి కాలుదువ్వుతున్నారు. నియోజకవర్గంలో పెత్తనం కోసం వారి మధ్య ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రస్తుతమున్న ఇన్‌చార్జిని మార్చాలంటూ ఆ పార్టీ 'ముఖ్య' సామాజికవర్గం నేత పట్టుబడుతుండగా ఎస్సీ నియోజకవర్గంలో ఆయన పెత్తనమేంటని మరో వర్గం ఎదురు దాడి చేస్తోంది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు.

- యర్రగొండపాలెం టీడీపీలో ముసలం
- కత్తులు దూసుకుంటున్న ఎరిక్షన్, మన్నె వర్గాలు
- నేతల మధ్య ముదురుతున్న వర్గ పోరు
- టీడీపీ అధిష్టానానికి పరస్పర ఫిర్యాదులు
- ఎస్సీ నియోజకవర్గంలో బాబు సామాజిక వర్గం నేత పెత్తనం
- మన్నెకే మద్దతునిస్తున్న జిల్లాలో మెజార్టీ శాసనసభ్యులు



మన్నె వర్గానికి 'ముఖ్య' సామాజిక వర్గం అండ

యర్రగొండపాలెం నియోజకవర్గం ఎస్సీ రిజర్వు అయినప్పటికీ డాక్టర్ మన్నె రవీంద్రదే పెత్తనం. సార్వత్రిక ఎన్నికల్లో అధిష్టానం ఎరిక్షన్‌బాబుకు టికెట్ కేటాయించడంతో ఆయన మిన్నకుండిపోయారు. నియోజకవర్గంలో పార్టీ ఓటమి చెందిన ప్రతిసారి తానే పెత్తనం చెలాయించాలనే ధోరణిలో ఆయన, ఆయన వర్గీయులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. ఇన్‌చార్జిని కాదని పార్టీలో వర్గ విభేదాలు సృష్టించడంపై ఆపార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఇన్‌చార్జిని ఇబ్బందులు పెట్టడం సరికాదన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా అధికార పార్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల అండదండలు మన్నె రవీంద్రకు పుష్కలంగా ఉన్నాయి. దీనిపై కూడా ఇన్‌చార్జి వర్గీయులు అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఇన్‌చార్జిని మార్చి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తారనే ప్రచారం వైపాలెంలో జోరుగా సాగుతోంది. ఇరువర్గాలు పోటాపోటీగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్న నేపథ్యంలో టీడీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పశ్చిమ ప్రకాశంలోని యర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అందని ద్రాక్షగా మిగిలిపోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం కూటమి అభ్యర్థులు విజయం సాధించగా ఇక్కడ మాత్రం ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అయినా పార్టీ అధికారంలోకి రావడంతో పెత్తనం కోసం రెండు వర్గాలు పోట్లాడుకుంటున్నాయి. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన ఎరిక్షన్ బాబు ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే ఈ నియోజకవర్గంలో ఎప్పటి నుంచో చక్రం తిప్పుతున్న సీనియర్ నాయకుడు మన్నె రవీంద్ర పెత్తనం కోసం పావులు కదుపుతూనే ఉన్నారు. నేనంటే.. నేను అంటూ నియోజకవర్గంలో పట్టు కోసం వీరు తమ వర్గాలను కూడగడుతున్నారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే రెండు వర్గాల నేతలు ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా తమ ఆధిపత్యం కోసం కత్తులు దూసుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఎరిక్షన్ బాబు పెత్తనమే నడుస్తుండటంతో వ్యతిరేక వర్గం జీర్ణించుకోలేకపోతోంది. అడుగడుగునా ఆయన్ను కట్టడి చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా ఇన్‌చార్జి చేస్తున్న అవినీతి కార్యక్రమాలకు అడ్డుపడుతూ ఆయనపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తోంది. అలాగే వ్యతిరేక వర్గాన్ని కట్టడి చేసేందుకు ఎరిక్షన్ బాబు కూడా పావులు కదుపుతూనే ఉన్నారు. నియోజకవర్గంలో తన పెత్తనమే చెల్లేలా అధికారులకు సైతం స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తుండడంతో ఇరువర్గాల మధ్య వైరం మరింత ముదిరింది. ఎర్రగొండపాలెంలో ఇటీవల టీడీపీకి చెందిన రేషన్ దుకాణాలను మార్కాపురం సబ్‌కలెక్టర్, ఐఏఎస్ అధికారి తనిఖీ చేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు అనుచరులు వారిపై తిరగబడ్డారు. దురుసుగా వ్యవహరించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీనిని ఆసరాగా తీసుకుని ఎరిక్షన్ బాబు అవినీతిపై అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు వ్యతిరేక వర్గం సిద్ధమైంది.

రాజుకున్న ఫ్లెక్సీల వివాదం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. దోర్నాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎరిక్షన్‌బాబు వర్గం ఫ్లెక్సీలు వేసింది. అందులో ప్రధాని మోదీ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఫొటోలు ప్రచురించలేదు. ఇది పెద్ద దుమారాన్నే రేపింది. అటు బీజేపీ నేతలు, ఇటు ఎంపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నేతల ఫొటోలు ఎందుకు ముద్రించలేదంటూ నిలదీశారు. ఇదే అదునుగా భావించిన మన్నె రవీంద్ర వర్గం ఎరిక్షన్‌బాబు వ్యతిరేకులందరినీ కూడగట్టే ప్రయత్నం చేసింది. ఈ అంశంపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తూనే అతని అవినీతి కార్యక్రమాలను సైతం అధినాయకుల ముందుంచి ఇన్‌చార్జిని మార్చాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు పోకడ పోకుండా గతంలోలా త్రిసభ్య కమిటీ నియమించాలని మన్నే వర్గం అధిష్టానాన్ని కోరుతోంది. మరో వైపు ఎరిక్షన్ బాబు సైతం తన వ్యతిరేక వర్గం చేస్తున్న కుట్రలను అధిష్టానానికి ఫిర్యాదుల రూపంలో తెలియజేస్తూ వస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ, ఇప్పుడు రవీంద్ర వర్గం ఇబ్బంది పెడుతోందంటూ అధిష్టానం వద్ద తన గోడు వెళ్లబోసుకుటున్నట్టు తెలిసింది.

ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీకి సంబంధించి ఇంటర్మీడియెట్, ఎస్ఎస్‌సీ కోర్సులపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం స్థానిక ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. అనంతరం సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. 14 ఏళ్ల వయసు నిండిన పిల్లలు ఎస్ఎస్‌సీ కోర్సులో చేరేందుకు, 10వ తరగతి ఉత్తీర్ణులై ఒక ఏడాది గ్యాప్ ఉన్న వాళ్లు ఇంటర్మీడియెట్ చేరేందుకు అర్హులని దీనిపై ప్రచారం నిర్వహించి విద్యార్థులు చదువుకునేలా చూడాలన్నారు. ఆర్థిక, కుటుంబపరమైన సమస్యలతో చదువు మధ్యలో మానేసి తిరిగి చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశమన్నారు. ఈ నెల 28 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఓపెన్ స్కూల్లో చేరవచ్చన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, డీఈఓ సుభద్ర, జెడ్పీ సీఈఓ మాధురి, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఏసీ శివకుమార్, ఒంగోలు ఎంఈఓ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.359

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన పొగాకు వేలంలో గరిష్ట ధర కేజీ రూ.359 పలికిందని టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాలకు 10,437 బేళ్లు రాగా 8,821 కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 1,616 బేళ్లు తిరస్కరించారని వెల్లడించారు. ఒంగోలు(పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 124వ రోజు వేలానికి 5,088 బేళ్లు రాగా 4,454 కొనుగోలయ్యాయి. వివిధ కారణాలతో 634 బేళ్లను తిరస్కరించారు. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 118వ రోజు వేలానికి 5,349 బేళ్లు రాగా 4,367 కొనుగోలయ్యాయి. మొత్తం వేలం కేంద్రాల్లో గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.307.13 పలికింది.

ఆ ఊరికి రేషన్ అందింది !



సోమవారం సాయంత్రం షాపు నెంబర్ 10లో దింపుతున్న రేషన్ బియ్యం బస్తాలు



ఇండ్ల చెరువులో మంగళవారం ఇంటింకీ రేషన్ సరఫరా చేస్తున్న వాహనదారు


సాక్షి ఎఫెక్ట్..

దర్శి: టీడీపీ నేతల దౌర్జన్యంతో రేషన్ బియ్యం పంపిణీ ఆగిపోయిన ఆ గ్రామస్తులకు 'సాక్షి' చొరవతో ఎట్టకేలకు రేషన్ అందింది. "రేషన్ బండి మా ఊళ్లోకి వస్తే తగులబెడతాం" అనే శీర్షికన 'సాక్షి' దినపత్రిక స్టేట్ పేజీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామంలో రేషన్ షాపు నంబర్ 10 రేషన్ డీలర్ అద్దంకి వెంకటేశ్వర్లుకు 12 టన్నుల రేషన్ బియ్యాన్ని ఎట్టకేలకు దింపారు. మంగళవారం నుంచి గ్రామంలో వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. దీంతో ఆ గ్రామంలో పేదలు సంతోషంగా ఉన్నారు. 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జరిగింది ఇదీ..

దొనకొండ మండలం ఇండ్ల చెరువకు ఎన్నిసార్లు రేషన్ బియ్యం పంపాలని చూసినా టీడీపీ నాయకులు అడ్డుతగులుతున్నారు. 31వ తేదీన పై అధికారుల ఆదేశాల మేరకు ఇండ్లచెరువు షాపు నంబర్ 10కి 12 టన్నుల బియ్యంతో రేషన్ లారీని ఇండ్ల చెరువుకు పంపారు. వచ్చిన లారీని టీడీపీ నేతలు అడ్డుకుని తగులబెడతామని వెనక్కు వెళ్లాలని బెదిరించారు. దీంతో అధికారులు లారీని తీసుకుని వెనక్కు వెళ్లారు. మళ్లీ శనివారం రేషన్ లారీని పోలీస్ బందోబస్తుతో తీసుకెళ్లినా పోలీసులను లెక్క చేయలేదు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పై అధికారులు స్పందించి పటిష్ట బందోబస్తు మధ్య గ్రామంలో సోమవారం రేషన్ బియ్యం దింపారు.


'సాక్షి' చొరవతో రేషన్ దక్కింది



మేము ఎస్సీలం. ప్రతి నెలా మాకు మా డీలర్ తప్పకుండా రేషన్ అందించేవారు. రాజకీయ నాయకుల పంతం, అధికారుల నిర్లక్ష్యంతో మా ఊరికి రేషన్ డీలర్‌కు అందించలేదు. మంగళవారం రేషన్ ఇచ్చారంటే 'సాక్షి' పత్రికలో కథనం మేరకు అధికారులు స్పందించారు. అందుకు 'సాక్షి' యాజమాన్యానికి ధన్యవాదాలు.

– పెడిపోగు రామయ్య, ఇండ్లచెరువు

రేషన్ ఇవ్వరేమో అని భయపడ్డాం



మాకు రేషన్ ఇస్తారో లేదో అని అనుకున్నాం. 'సాక్షి' పత్రికలో వార్త ప్రచురించారు. పై అధికారుల స్పందనతో సోమవారం సాయంత్రం గ్రామంలో రేషన్ బియ్యం దింపారు. గ్రామస్తులు అందరూ సంతోషంగా ఉన్నారు.

– వెన్నపూస చెంచిరెడ్డి, ఇండ్లచెరువు

ప్రజాస్వామ్యంలో ఇది దారుణం



పత్రికలు వారి అన్యాయాన్ని ఎండగడితేనే పథకాలు అందించడం దారుణం. 'సాక్షి' కథనం వలనే గ్రామానికి రేషన్ అందించారు. పై అధికారులు స్పందించి ఉండకపోతే గ్రామంలోకి రేషన్ రానిచ్చే వారు కాదు.

– శినిగే పిచ్చిరెడ్డి, ఇండ్లచెరువు

సామాజిక పెన్షన్లు రూ.9 వేలు ఇవ్వాలి



పెన్షనర్ల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్ల సంఘం

ఒంగోలు టౌన్: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వైద్య ఖర్చుల నేపథ్యంలో వృద్ధులకు ఇచ్చే రూ.4 వేల సామాజిక పెన్షన్ ఏమూలలకు కూడా సరిపోదని, వారికి ప్రస్తుత ధరలకనుగుణంగా నెలకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జి.శేషయ్య అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో సుబ్బారావు మాట్లాడుతూ 30 నుంచి 40 సంవత్సరాల పాటు కార్మికుల చేత పనులు చేయించుకొని నామమాత్రంగా మాత్రమే పింఛన్ విదిలిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద లక్షల కోట్ల రూపాయల ప్రావిడెంట్ ఫండ్ నిల్వలు ఉన్నాయని, వాటిని షేర్ మార్కెట్లలో పెడుతున్న కేంద్ర ప్రభుత్వం కార్మికుల నోట్లో మట్టి కొడుతోందని మండిపడ్డారు. దేశంలోని వయో వృద్ధుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాల వైఖరి ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. వయో వృద్ధులకు రైళ్లలో, ఆస్పత్రుల్లో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛనర్లకు రావలసిన పీఆర్సీ, డీఏ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఈపీఎస్ పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, గత ఏడాది జులై నుంచి 12వ పీఆర్సీకి కమిషన్ ను నియమించి, వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో పి.పేరయ్య, సీహెచ్ రాంబాబు, రాబిన్ రవికుమార్, వెంకటేశ్వరరెడ్డి, డి.శ్రీనివాసులు, ఎంఏ సాలార్, ఎం.అయ్యపరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లు, ప్రకృత్తి విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతపై ప్రకాశం భవనంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు విజన్ డాక్యుమెంట్ రూపొందించాలన్నారు. జిల్లాలోని పరిస్థితులు, స్థానిక ప్రత్యేకతలు పరిగణలోకి తీసుకుని 2047 నాటికి జిల్లా సాధించాల్సిన అభివృద్ధిని తెలిపేలా ప్రణాళికలు ఉండాలన్నారు. అందుకు తగినట్లుగా అన్నీ శాఖల ఉన్నతాధికారులు వారి శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాస్థాయి అధికారుల టూర్ డైరీలను ప్రతి వారం పరిశీలిస్తానని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

78వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేసి ఘనంగా వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీఐపీలకు ఆహ్వానం, ఇన్‌చార్జ్ మంత్రి ప్రసంగం ప్రతుల తయారీపై దృష్టి సారించాలన్నారు. వీక్షకులకు తాగునీరు, స్నాక్స్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ప్రకృతి విపత్తులపై ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలి:

తుఫాన్‌లు, ఎటువంటి ప్రకృతి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేలా అవసరమైన ముందస్తు చర్యలుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో తుఫాన్ షెల్టర్ల స్థితిగతులపై ఆరా తీశారు. వాటి మరమ్మతులకు అవసరమైన అంచనాలు రూపొందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

పశుగణనను విజయవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పశుగణన బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ, పశుసంవర్ధక శాఖ జేడీ

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో సెప్టెంబర్ నుంచి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పశుగణనను పశుసంవర్ధశాఖ అధికారులు సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పశుగణన బ్రోచర్‌ను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బేబి రాణి మాట్లాడుతూ జిల్లాలో పశుగణన ప్రతి ఐదేళ్లకు ఒక సారి నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు పశుగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశుగణన సిబ్బంది ఇంటికి వెళ్లి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు వంటి 15 అంశాలపై సమగ్ర వివరాలను సేకరిస్తారని చెప్పారు. పాలు, గుడ్లు, మాంసం ఇతరత్రా దిగుబడి ఎంత ఉందనేది ఈ గణాంకాల ద్వారా ప్రస్ఫుటమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు 306 మంది ఎన్యుమరేటర్లు, 75 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. ఎన్యుమరేటర్లుగా ఏహెచ్ఏలు, పారా వెటర్నరీ సిబ్బంది, సూపర్‌వైజర్లుగా సహాయ సంచాలకులు, పశువైద్యాధికారులు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. వీరికి ఆగస్టు 6 నుంచి 7 వరకు మార్కాపురం డివిజన్ పరిధిలోని సిబ్బందికి, ఆగస్టు 89 నుంచి 9వ తేదీ వరకు ఒంగోలు డివిజన్ పరిధిలోని సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందు కోసం కేంద్ర ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించిందన్నారు. సిబ్బంది సేకరించిన విషయాలను అందులో నమోదు చేస్తారని వివరించారు.

క్లుప్తంగా

చెరువులో జారిపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై పున్నారావు

టంగుటూరు: టంగుటూరు గ్రామ చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వాణీనగర్‌కు చెందిన కాకి అంజయ్య(60) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రోజూలాగే పని నుంచి ఇంటికి వచ్చాక కొద్ది సమయం బయట గడిపేందుకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా జాడ కనిపించలేదు. ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇంటి ముందు ఉన్న చెరువులో శవమై తేలాడు. కాళ్లు శుభ్రం చేసుకుంటున్న సమయంలో జారి పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్సై పున్నారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు గురుకులానికి ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

యర్రగొండపాలెం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ బుధవారం యర్రగొండపాలెం రానున్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేస్తారు. విద్యార్థులను కలిసి మాట్లాడిన తర్వాత గురుకుల విద్యార్థులతో చపాతీలు చేయించడంపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన చర్చిస్తారు. అనంతరం రోడ్లు, భవనాల అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఈనెల 2వ తేదీన నెహ్రూ బజారులో సెల్‌ఫోన్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ నాలి సత్యనారాయణపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కత్తితో దాడి చేసి పారిపోయిన ఆకుల భవానీ, నాగసాయి దుర్గను పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

టంగుటూరు: గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సూరారెడ్డిపాలెం సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కంచన్ గంధర్వ(41) బతుకుదెరువు కోసం సూరారెడ్డిపాలెంలో తిరుగుతుండగా సూరారెడ్డిపాలెం–కారుమంచి రోడ్డులో వెళ్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఆధార్ కార్డు మాత్రమే లభించింది. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై పున్నారావు పరిశీలించారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

కొత్తపట్నం: సముద్రపు అలల మధ్య చేపలు వేటాడుతుండగా వల కాళ్లకు చుట్టుకుని ప్రమాదవశాత్తు ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మడనూరు సముద్ర తీరంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామం స్వర్ణాంధ్ర పట్టపుపాలేనికి చెందిన కోడూరి తాతయ్య(58) మంగళవారం తెల్లవారుజామున రోజులాగే చేపల వేటకు వెళ్లాడు. అలల మధ్యకు వెళ్లి కొద్ది సేపు వేట కొనసాగించాడు. ఆలలు ఉధృతంగా రావడంతో వల కాళ్లకు చుట్టుకుని నీటిలో పడిపోయాడు. ఊపిరాడక కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. కొద్ది సేపటికి శవమై ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. తన సమీపంలోనే వేట సాగిస్తున్న కోడూరి గోవిందు మృతుడి భార్య బుజ్జమ్మకు ప్రమాద విషయం తెలియజేశాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి.సాంబశివరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఒడ్డుకు కొట్టుకొచ్చిన తాతయ్య మృతదేహం

నిత్యావసరాలకు కూటమి కత్తెర

- రెండు నెలలుగా బియ్యంతో సరిపెడుతున్న కూటమి ప్రభుత్వం
- పేదలకు అందని కందిపప్పు, గోధుమపిండి, పంచదార
- అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థ
- ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తున్న పేదలు



దర్శి మండలం సాయినగర్‌లో రేషన్ బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న దృశ్యం

దర్శి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. నిత్యావసరాల కోసం పేదలు ఇబ్బందులు పడకూడదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటివద్దకే వాహనాల ద్వారా రేషన్ బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమపిండి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. ఇటీవల టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటివద్దకు రేషన్ పంపిణీ చేసే వ్యవస్థకు మంగళం పలకాలని ఇప్పటికే ఓ నిర్ణయానికొచ్చారు. సాకులు చెబుతూ కార్డుదారులకు పంచదార, కందిపప్పు, గోధుమ పిండి పంపిణీ నిలిపివేశారు. చంద్రబాబు హామీలు అమలు చేస్తారని భావించిన పేద ప్రజలు ఇప్పుడు ఓట్లెందుకు వేశామా అని రెండు నెలలకే నెత్తీనోరు బాదుకుంటున్నారు.

ఐదేళ్లుగా ఇంటికే రేషన్

గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటికే రేషన్ సరుకులు వచ్చేవి. అడగకుండానే బియ్యంతోపాటు గోధుమపిండి, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇంతకంటే మిన్నగా పౌర సరఫరాల వ్యవస్థను తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు ఇచ్చారు. బియ్యంతోపాటు గోదుమలు, పంచదార, కందిపప్పు ఇతర సరుకులు కూడా రాయితీపై అందిస్తామని హామీలు గుప్పించి ప్రజలను నమ్మించి ఓట్లేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినా ఆ హామీ ఆచరణకు నోచుకోకపోగా కందిపప్పు, పంచదార, గోధుమపిండి పంపిణీని నిలిపేసి పేదలపై ఆర్థిక భారం మోపారు.

కార్డుదారులకు వంచన

ప్రతి రేషన్ కార్డు దారునికి ఉచిత బియ్యంతోపాటు సబ్సిడీ ధరకు కేజీ గోధుమపిండి, కేజీ కందిపప్పు, అర కేజీ పంచదార ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందివ్వాల్సి ఉంది. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు ఉండగా 6,76,160 కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో 385 రేషన్ వాహనాలు ద్వారా 9500 టన్నుల పీడీఎస్ బియ్యం ప్రతి నెలా పేదలకు ఇంటింటికీ తీసుకువెళ్ళి సరఫరా చేస్తున్నారు. 676టన్నుల కందిపప్పు, 338టన్నుల పంచదార, 676టన్నుల గోదుమపిండి సబ్సిడీ ధరలకే పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. కిలో కందిపప్పు రూ.67కు, కిలో గోధుమపిండి రూ.16కు, అరకిలో పంచదార రూ.17కు అందించారు. ప్రస్తుతం మార్కెట్‌లో గోధుమపిండి కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది. అరకిలో పంచదార రూ.48 నుంచి రూ.50 పలుకుతోంది. కిలో కంది పప్పు రూ.180 నుంచి రూ.185 వరకు విక్రయిస్తున్నారు. ఇవన్నీ సబ్సిడీపై అందించాల్సిన కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టి కార్డుదారులను వంచిస్తోంది. దీంతో అధిక ధరలు చెల్లించి పేదలు నిత్యావసరాలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు నెలలుగా కూటమి ప్రభుత్వం కార్డుదారులకు ఎక్కడా కంది పప్పు, గోదుమపిండి, పంచదార ఇవ్వడం లేదు. ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ చేస్తున్నారు. ఈ నెలలో కూడా బియ్యం మినహా మరే ఇతర సరుకులు రాలేదని చెబుతుండటంతో కార్డుదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ఎగ్గొట్టేందుకు సాకులు

పంచదార, కందిపప్పు ప్యాకెట్ల తూకంలో తేడా వస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించారని ఈ నేపథ్యంలోనే పంచదార సరఫరా నిలిపివేశారని అధికారులు చెబుతున్నారు. ఎక్కడైనా తూకంలో తేడా వస్తే పంపిణీ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి కానీ రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడీ సరుకులు నిలిపివేయడం ఏమిటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. గోడౌన్లలో పంచదార స్టాక్ ఉన్నా పంపిణీ చేయకపోవడంపై కూటమి నేతలు చెప్పే మాటలకు చేస్తున్న పనులుకు సంబంధం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నిలిపేసిన రెండు నెలల సరుకులతో ఈ నెల సరుకులు కలిపి ఇవ్వాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



షాట్‌పుట్ విసురుతున్న బాలిక



లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థిని

యర్రగొండపాలెం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ పి.ఆంజనేయులు సూచించారు. మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలాల్లోని జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు అథ్లెటిక్స్ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. బాలికలు క్రీడల్లో పాల్గొన్నప్పుడే తమలో ఉన్న ఉత్సాహాన్ని రెట్టింపు చేసుకోగలుగుతారని, తద్వారా చదువులపై ఎక్కువగా శ్రద్ధ చూపుతారన్నారు. ప్రత్యేకంగా బాలికలకు క్రీడల పోటీలు నిర్వహిస్తున్న ఆర్డీటీ సంస్థ ప్రతినిధులను అభినందించారు. అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వారు అనంతపురంలో నిర్వహించనున్న సెంట్రల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆర్డీటీ ఏరియా టీం లీడర్ గిరిజ తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

24 నుంచి అద్దంకిలో శతావధానం

అద్దంకి: సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యంచే నాలుగో శతావధానం అద్దంకిలో ఈ నెల 24,25,26 తేదీల్లో నిర్వహించనున్నట్లు సాహితీ మిత్ర మండలి గౌరవాధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని చిన్నికాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో మంగళవారం కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారణాశి రఘురామశర్మ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో శతావధానంలో పేరుగాంచిన నారాయణం బాలసుబ్రహ్మణ్యం మన అద్దంకి వాసి కావడం, అద్దంకికి లభించిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. శతావధానం పద్యానికి సంబంధించిన ఒక పద్యక్రీడ అని, 350కి పైగా అష్టావధానాలు, మూడు శతావధానాలు చేసిన కవి, పండితునిచే నిర్వహించనున్న శతావధానం అద్దంకి సాహితీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని డాక్టర్ దేవపాలన అన్నారు. పద్యం పుట్టిన గడ్డపైన, పద్యం పాతబడ్డది అనేవారికి, పద్యం నిత్యనూతనం అని తన శతావధానం ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యం నిరూపిస్తున్నారని సృజన సంస్థ అధ్యక్షుడు గాడేపల్లి దివాకర దత్తు నారాయణాన్ని ప్రశంసించారు. శతావధాని నారాయణం మా సమకాలికులవడం మా అదృష్టమని రోటరీ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య వెల్లడించారు. అన్ని సంస్థల తోడ్పాటుతో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అద్దంకి సాహిత్య కేతనాన్ని ఎగురవేద్దామని మిత్రమండలి కార్యదర్శి కె.వి.పోలిరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొలలపూడి శ్రీనివాసరావు, లక్కరాజు శ్రీనివాసరావు, లక్కరాజు విశ్వమోహన్, బాచిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

చీరాల: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చీరాల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక తెల్లగాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో నివాసముండే కనక పరమశివ (35) గత కొంత కాలంగా కుటుంబంలో విబేధాలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన పరమశివ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు



ఎంపికైన బాలికల జట్టు

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ ప్రకాశం జిల్లా సీనియర్ విభాగం స్త్రీ, పురుషుల జట్లను మంగళవారం స్థానిక ఏబియం జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు. ఫిజికల్ డైరెక్టర్లు హజీరాబేగం, రాజ్యలక్ష్మి, సృజన, కౌసల్య, ఆర్.కోటయ్య , ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుర్రా భాస్కరరావు తదితరులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం ఎంపికైన క్రీడాజట్లను ఉద్దేశించి ఏబీఎం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దేవరకొండ శివాని, ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు, విద్యావకాశాలు పెరుగుతాయని, అంతే కాకుండా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఎంపికైన జిల్లా జట్లు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

మహిళల జట్టు

ఐ.నాగవేణి(మైనంపాడు), మాధురి, నీలిమా, దివ్యకీర్తన(కందుకూరు), కె.హేమలత, ఎస్‌కే సాధియా, డి.అను(మర్లపాడు, ఎ.హర్షిత, ఓ.శిల్పన(కరేడు, పి.ప్రతిమ(లింగసముద్రం, డి.ప్రవల్లిక, జి.హారిణి(త్రోవగుంట), కె.లిప్సికా, ఎస్‌కే కరీనా(అల్లూరు), ఎ.జ్ఞాన సహస్ర(క్విజ్), భానుశ్రీ, ఎస్.హర్షిణి(పేస్ స్కూలు)

పురుషుల జట్టు

పి.వాసుదేవరాజు(పేస్), ఎ.ప్రణయ్, ఎ.అరుణ్ కుమార్(మర్లపాడు), డి.పీయూష్ చక్రధర్(చీరాల), కె.సుజిత్ సంజయ్(ఒంగోలు), చరణ్‌తేజ, బ్రహ్మర్షి(క్విజ్), విదీష్(ఒంగోలు), కార్తీక్(గురవారెడ్డిపాలెం), రాజు(దొనకొండ), అభిరామ్(పాదిలి), ఇ.జస్వంత్(త్రోవగుంట), పవన్ కళ్యాణ్(పేస్), సీహెచ్ వెంకటేష్(తిమ్మసముద్రం), కె.నరసింహ(మర్లపాడు), ఎస్.హర్ష(పేస్), ఎం.మహేష్, పి.చరణ్(దర్శి గురుకుల పాఠశాల), సీహెచ్ కార్తీక్(పేస్ స్కూల్)

పెద్దమనుషులమంటూ.. సచివాలయ ఫెన్సింగ్ ధ్వంసం



టీడీపీ అనుచరులు ధ్వంసం చేసిన సచివాలయం ఫెన్సింగ్



ధ్వంసం చేసిన ఫెన్సింగ్‌ను సరిచేస్తున్న దృశ్యం

- చిన్నకంభంలో టీడీపీ నేతల అరాచకం
- ఉపాధి హామీ శిలాఫలకం ముక్కలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి



పంచాయతీ కార్యదర్శికి వేలు చూపుతూ బెదిరిస్తున్న టీడీపీ నాయకుడు



కార్యదర్శిని చుట్టుముట్టిన పచ్చ దండు

కంభం:

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికారం అండగా ఉంది తామేం చేసినా చెల్లుబాటవుతుందనుకొని ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతూ అడ్డొచ్చిన అధికారులతో సైతం ఘర్షణకు దిగుతున్నారు. కంభం మండలంలోని చిన్నకంభం సచివాలయం చుట్టూ ముళ్లకంచెతో వేసిన ఫెన్సింగ్ ఉంది. దాని పక్కనే రంగస్వామి గుడి ఉంది. సోమవారం సాయంత్రం నక్కా ప్రసాద్, నక్కా రంగయ్య (ఆర్‌అండ్‌బీ ఉద్యోగి), చరణ్ ఇంకా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రంగస్వామి గుడికి చెందిన పెద్ద మనుషులమని చెబుతూ సచివాలయం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ ఓ వైపు ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన పంచాయతీ సెక్రటరీ సుధాకర్, సచివాలయ సిబ్బందిని దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగారు. జరిగిన విషయంపై పంచాయతీ కార్యదర్శి సోమవారం సాయంత్రం కంభం ఎస్సైకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ఉదయం కార్యాలయం వద్దకు రాగా తూర్పు వైపున మిగిలి ఉన్న ఫెన్సింగ్‌ను జాతీయ ఉపాధిహామీ పనులకు సంబంధించి అక్కడ ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఉన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మళ్లీ కంభం ఎస్సైకు సమాచారం అందించారు. ఇద్దరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు జరిగిన విషయంపై కేసులెందుకులే సర్దుకోమని కార్యదర్శికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ధ్వంసం చేసిన ఫెన్సింగ్‌ను అధికారుల అనుమతులు లేకుండానే తిరిగి కొందరు వ్యక్తులు యథావిధిగా ఏర్పాటు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం పై పలు విమర్శలకు తావిస్తోంది. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడమే కాక అడ్డు వచ్చిన నాపై, సచివాలయ సిబ్బందిపై వాగ్వాదానికి దిగి దుర్భాషలాడిన దుండగులను కఠినంగా శిక్షించాలి. సోమవారం సాయంత్రం సంఘటన జరగగా పోలీసులకు ఫిర్యాదు చేశాను. అదే రోజు పెద్దమనుషులు చెప్పడంతో సర్దుకున్నాం. అయినా మంగళవారం తిరిగి వచ్చి చూసే సరికి మిగిలిన ఫెన్సింగ్‌తో పాటు, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించి పోలీసులకు ఫిర్యాదు చేశాను. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– చంచు సుధాకర్, కార్యదర్శి, చిన్నకంభం

రాగి తీగ చోరీ ముఠా అరెస్టు



సీజ్ చేసిన రాగి, అల్యూమినియం వైరు, పక్కన నిందితులు

అద్దంకి: పగలు సుబాబుల్ తోటల్లో పనులు చేసుకుంటూ రాత్రి సమయాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగ చోరీ చేసే ముఠాను పోలీసులు పట్టుకొని కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం సీఐ క్రిష్టయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన పీ చెంచురామయ్య, యాటగిరి రామయ్య అనే యువకులు, మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగను చోరీ చేస్తుంటారు. వీరంతా కలసి అద్దంకి, జే. పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, చినగంజాం, వేటపాలెం, మార్టూరు మండలాల్లోని 39 కేసుల్లో ఆయా మండలాల్లోని పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగను చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై నాగరాజు, మరో ఐదుగురు బృందంగా ఏర్పడి నందితులను పట్టుకున్నట్లు చెప్పారు. వీరంతా రాత్రి సమయాల్లో షికారుకనే నెపంతో పొలాల్లోకి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను చోరీ చేస్తున్నట్లు చెప్పారు. తేలికగా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా వారు ఎంచుకున్నట్లు సీఐ చెప్పారు. మండలంలోని శింగరకొండపాలెం గ్రామం వద్ద మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4.5 లక్షల విలువైన వైరును రికవరీ చేసినట్లు చెప్పారు. మా వంతు ప్రయత్నం చేస్తున్నామని, రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యతను ప్రదర్శించిన ఎస్సై నాగరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.